

2 లో

# బొంపల్లిలో అక్రమ క్వారీ తవ్వకాలు ఆపివేయాలి

-ప్రజావాణిలో కలెక్టర్‌కు

కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు


ప్రజాజ్యోతి

కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

మంగళవారం 29 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:19






# మోదీ, అమిత్‌షా కనుసన్నల్లో - ఎన్నికల కమిషన్

## - అధికారం కోసం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: - విజయరమణారావు

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:**

మోదీ, అమిత్‌షా కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని, అధికారం కోసం బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మిగతా 2 లో

# విద్యార్థులు ఆకలితో అలమటించొద్దు

## – ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు

## -ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నాం..

## బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:**

పేద విద్యార్థులు ఆకలితో అలమటించ కూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం హరే రామ హరే కృష్ణ ట్రస్టు భాగ స్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన అల్పాహార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

మిగతా 2 లో



# మోదీ, అమిత్‌షా కనుసన్నల్లో ఎన్నికల కమిషన్

మొదటిపేజీ తరువాయి

ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, ఎన్నికల కమిషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ తీరుకు నిరసనగా భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయరమణారావు పాల్గొని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. గతంలో పలుమార్లు అడ్డదారుల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఈసారి ఎస్ఐఆర్ కార్యక్రమం పేరుతో తమకు అనుకూలంగా లేని ప్రాంతాల్లో ఓట్ల తొలగింపునకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ఎన్నికల కమిషన్ పనితీరులో మార్పు రాలేదన్నారు. ఎన్నికల కమిషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారశైలిపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ చర్యల కారణంగా దేశంలో 13 కోట్ల ఓట్లు గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఆయన విధుల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బీజేపీ అగ్రనేతలకు అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.



ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులు, ప్రతిపక్ష పార్టీలు గళం విప్పాలని విజయరమణారావు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కూడా అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ, బ్లాక్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటకు ఉదయం, రాత్రి బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

### - రామాజీపేట్ సర్పంచ్ బెజ్జంకి మోహన్...

**రాయికల్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

రాయికల్ మండలంలోని కొత్తపేట గ్రామానికి ఉదయం, రాత్రి వేళల్లో బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బెజ్జంకి మోహన్, నాయకులు గుజ్జుల మోహన్ రెడ్డి, సూర విజయ్ రెడ్డి జగిత్యాల డిపో మేనేజర్‌ను కోరారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గతంలో నడిచిన ఉదయం మరియు రాత్రి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని వారు డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి, బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.




# విద్యార్థులు ఆకలితో అలమటించొద్దు

మొదటిపేజీ తరువాయి



పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన తెలంగాణ అల్పాహార కార్యక్రమంలో విజయరమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల డైట్ ఛార్జీలు పెంచకుండా నిర్లక్ష్యం చేశారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచి విద్యార్థులకు అండగా నిలిచిందని విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి జిల్లా విద్యారంగంలో ముందంజలో ఉందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.70 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నామని, దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. రూ.200 కోట్లతో పెద్దపల్లి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. అన్ని కులాలు, మతాలకు చెందిన విద్యార్థులు సమానంగా విద్యనభ్యసించేలా ఈ పాఠశాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, తహసీల్దార్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, పట్టణ కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

**మల్లాపూర్, సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి**

మండలంలోని కొత్త ధామ్‌రాజ్‌పల్లి గ్రామంలో శివసేన యూత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎగ్యరపు లింబాద్రి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశం కోసం చేసిన త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువత దేశభక్తి, సమాజ సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వంశీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ బద్దం హరీష్ రెడ్డి, వార్డు సభ్యులు బద్దం రామ్ చందర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, కాంతయ్యతో పాటు శివసేన యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# బొంపల్లిలో అక్రమ క్వారీ తవ్వకాలు ఆపివేయాలి

మొదటిపేజీ తరువాయి

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి;**

పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 179లో జరుగుతున్న అక్రమ క్వారీ తవ్వకాలు, బ్లాస్టింగ్‌లపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి సునీల్ గౌడ్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బొంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 179లో కొందరు క్వారీ, క్రషర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ బిల్డింగ్ స్టోన్, ఇతర మెటీరియల్స్‌ను సరఫరా చేస్తున్నారని సునీల్ గౌడ్ ఆరోపించారు. గత 10 నుంచి 15 ఏళ్లుగా అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ తవ్వకాల ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్ల రూపాయల రాయల్టీని ఎగవేస్తూ ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాల్లో జిలెటిన్ స్టిక్స్, ఇతర పేలుడు పదార్థాలను నిల్వ చేసి జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్నారని కూడా ఆయన ఆరోపించారు. బ్లాస్టింగ్‌ల కారణంగా సమీపంలోని పంట పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. క్వారీలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని వసూలు చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై స్పందించిన అధికారులు, మైనింగ్ శాఖ ద్వారా వారంలోగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సునీల్ గౌడ్ తెలిపారు. అధికారులు స్పందించకపోతే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఆశ్రయిస్తామని, రైతులను సమాయత్తం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

## - సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్

**ఎలిగేడు, సెప్టెంబర్ 28:(ప్రజాజ్యోతి)**




పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు సహకారం, గ్రామ ప్రజల ఆశీస్సులతో ర్యాకల్ దేవ్ పల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ అన్నారు.సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో సుమారు రూ.40 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాత గ్రామపంచాయతీ భవనాన్ని తొలగించి నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మాణం ప్రారంభించినము తెలిపారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, రోడ్లు తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా, స్ట్రీట్ లైట్లు, శానిటేషన్ తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ రమాదేవి సంపత్ అన్నారు. అలాగే గత కొన్ని కొన్ని సంవత్సరాలుగా వైకుంఠధామం కు కరెంటు లేక గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతూ ఉంటే వారి అవసరాలను అర్థం చేసుకొని ప్రజలకు ఇబ్బంది కలగకూడదని చొరవ తీసుకొని వైకుంఠ వైకుంఠ దామానికి నూతనంగా కరెంటు సాంక్షన్ చేయించినాము అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి, ర్యాకల్ దేవ్ పల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారం, ఆశీస్సులతో మరింత అభివృద్ధి సాధించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు.

# భగత్‌సింగ్ ఆశయాలతో యువత ముందుకు సాగాలి

**ధర్మారం,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి న్యూస్):**

పీపుల్స్ యువసేన 892/2025 సర్వ్ టు సొసైటీ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు షాహిద్ భగత్‌సింగ్ 119వ జయంతి వేడుకలను ధర్మారం పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పీపుల్స్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మేకల సంజీవరావు మాట్లాడుతూ.. సమసమాజ స్థాపన, సమాన అవకాశాలు, దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనే సందేశంతో "గంజాయి వద్దు.. గ్రంథాలయాలు ముద్దు", "మద్యం, మత్తు పదార్థాలను వీడండి.. మైదానాలకు చేరువకండి" అనే నినాదాలతో ధర్మారం పట్టణంలో 2కె రన్ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అంద జేశారు.కార్యక్రమంలో పీపుల్స్ యువసేన సభ్యులు కొమురయ్య, తిరుపతి, సిద్ధు, మహేష్, నాగరాజు, రంజిత్‌తో పాటు సామాజిక కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.



# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## - అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

### - ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి;**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగుండం నగరం కేసిఆర్ కాలనీ కు చెందిన యం.డి.అహ్మోదొద్దిన్ తాను వికలాంగుడినని, బి.కాం పూర్తి చేశానని, తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సోసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన అజిమా బేగం తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం ఐతరాజు పల్లె గ్రామానికి చెందిన దాసరి రాజారెడ్డి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 290 , 291 లోని 8 గుంటల భూమి సాదా బైనామ ద్వారా కొనుగోలు చేశామని తమకు పట్టా చేయాలను కోరుతూ దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారి పెద్దపల్లికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పాలకుర్తి



మండలానికి చెందిన మాదాసు అమృత తమకు సంబంధించిన షెడ్డును ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయానికి ఉపయోగించుకుని సెప్టెంబర్ నెలలో కొత్త కార్యాలయం ఓపెన్ చేసుకోవడం జరిగిందని అన్నారు. పాలకుర్తి తహసిల్దార్ కార్యాలయం వినియోగించుకోవడం కోసం తమకు ఎటువంటి కిరాయి 72590/- , కరెంట్ బిల్లు 2,69,547/- చెల్లించలేదని వీటిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ పాలకుర్తి కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశలతో యువత ముందుకు సాగాలి సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ర్యాకల్ దేవ్ పల్లి:

**ఎలిగేడు సెప్టెంబర్ : 28 (ప్రజా జ్యోతి)**

స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే భగత్ సింగ్ చేసిన త్యాగం, ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.భగత్ సింగ్ దేశభక్తి, త్యాగం, ధైర్యం, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన నిబద్ధతను స్మరించుకుంటూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. యువత విద్యతో పాటు దేశ సేవ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుక్క అశోక్ ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్ ఆశ వర్కర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.




# బి జే వై ఎం ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు

**ఇల్లంతకుంట సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి)**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం బీజేవైఎం మండల అధ్యక్షులు మంత్రి అరుణ్ ఆధ్వర్యంలో షాహిద్ భగత్ సింగ్ జయంతి వేడుకలను సోమవారం రోజు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు దేశెట్టి శ్రీనివాస్, మండల ఎస్ సీ మోర్చా అధ్యక్షులు కొమ్ము హరికృష్ణ, ముస్కాన్ పేట ఉప సర్పంచ్ దాసరి శ్రీనివాస్ లావణ్య, మండల కార్యవర్గ సభ్యులు చేక్యాల శ్రీనివాస్, వార్డు సభ్యులు సుధగోని శ్రీకాంత్, దురుముట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ సింగిల్ విండో సభ్యులకు 79 లక్షల దీర్ఘకాలిక రుణాలు 7 కోట్ల స్వల్పకాలిక రుణాలు ఇచ్చాం....

## తిమ్మాపూర్ సింగిల్ విండో అధ్యక్షులు రామగిరి సుదీర్ రావు.....

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ సింగల్ విండో సభ్యులకు ఈ సంవత్సరం 79 లక్షల దీర్ఘకాలిక రుణాలు 7కోట్ల స్వల్పకాలిక రుణాలు అందజేశామని తిమ్మాపూర్ సింగిల్ విండో అధ్యక్షులు రామగిరి సుధీర్ రావు తెలిపారు , తిమ్మాపూర్ సింగల్ విండో లో అధ్యక్షులు రామగిరి సుధీర్ రావు అధ్యక్షతన మహాసభ జరిగింది , రైతులకు 360టన్నులు యూరియా సొసైటీ పరిధి గ్రామాలలో అందజేశామన్నారు, సంఘం లాభాల బాటలో ఉందని సంఘం లోని గ్రామాలలో రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు అందజేస్తామని రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగు చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ మహ్మద్ షఫీ యుద్దీన్ పాల్గొని ప్రసంగించారు, ఎల్లారెడ్డిపేట మండలంలో 100 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఆయన చెప్పారు తిమ్మాపూర్ సొసైటీ పరిధిలో కొందరు రైతులు 55 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ముందుకు వచ్చినట్లు చెప్పారు, ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు 90 శాతం బీసీలకు 80% ఓసీలకు 70% సబ్సిడీ ఇస్తున్నట్లు ఎకరానికి వెయ్యి రూపాయలు చెల్లిస్తే 50 మొక్కలు పంపిణి చేయడం జరుగుతుందన్నారు, వరి ధాన్యం ఇంకా నెల రోజులలో చేతికి వస్తున్నందున ఈసారి రైతులకు ఇబ్బంది కలగకుండా తగినన్ని గన్ని బ్యాగులను సమకూర్చాలని తూకాల్లో మోసాలు జరగకుండా హమాలీలతో మాట్లాడాలని రైతులు చైర్మన్ సుధీర్రావుకు వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మకు పాలకవర్గ సభ్యులకు విజ్ఞప్తి చేశారు , సొసైటీ పరిధిలో సింగిల్ విండో పాధ్యక్షులు బుగ్గ కృష్ణమూర్తి శర్మ, సంఘ



డైరెక్టర్లు , , గుగులోత్ నరహరి, మాలోత్ శ్రీరామ్,కొంపల్లి కళావతి, రణవేణి లక్ష్మణ్, పెంజర్ల నారాయణ, గూగులోతు శ్రీరామ్,అందే గంగవ్వ తదితరులు రైతులు సెక్రటరీ కొండ శశివర్ధన్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు,

# ముఖ్యమంత్రిసభనువిజయవంతం చేయండి

## - వి.హనుమంతరావుపిలుపు

**వేములవాడ:సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓబీసీ భారత జాతీయ అధ్యక్షుడు వి. హనుమంతరావు పిలుపునిచ్చారు.సోమవారం వేములవాడ పట్టణం లోని మున్నూరు కాపు సత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.దేశంలో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగపరమైన హక్కులు అందుతున్నప్పటికీ, బడుగు బలహీన వర్గాల్లో అధిక జనాభా కలిగిన బీసీలకు తగిన న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ జనాభా లెక్కలు చేపట్టాలని పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. బీసీలకు న్యాయం చేయడంతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

**పేదలకు ఇందిరమ్మ ఇళ్లు: బొప్ప దేవయ్య**

మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు సరైన వసతులు కల్పించలేదని విమర్శించారు. పేదలు, రైతులు, కూలీలు తమ పశువులను ఉంచుకునేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తోందని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



చేస్తున్నట్లు తెలిపారు.

**ప్రతి అర్హుడికి రేషన్ కార్డు: ఇప్పపూల అజయ్**

మున్నూరు కాపు వేములవాడ పట్టణ ఉమ్మడి అధ్యక్షుడు ఇప్పపూల అజయ్ మాట్లాడుతూ, గతంలో కొత్తగా ఏర్పడిన కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు కాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు అందిస్తూ పేదలను ఆదుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసి, నియోజకవర్గంలో ఇంకా మిగిలి ఉన్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ద్వారా అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.

**ప్రజలకు అండగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్: కొమురయ్య**

మున్నూరు కాపు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల



కొమురయ్య మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఎల్‌ఓసీలు మంజూరు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నారని కొనియాడారు. వేములవాడ నియోజక వర్గంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు జిల్లా ప్రధాన కార్యదర్శి పోనిశెట్టి శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎర్రం మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నామాల పోశెట్టి, జిల్లా ప్రచార కార్యదర్శి బొప్ప బిక్షపతిపటేల్ , వేములవాడ పట్టణ సంఘం అధ్యక్షుడు కోయినేని బాలయ్య పటేల్, పటేల్ సంఘం అధ్యక్షుడు సారా శ్రీనివాస్ పటేల్, బోనాల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శంకర్ పటేల్, సాసాల రాజారాం పటేల్, చింతపంటి లక్ష్మీరాజ్యం పటేల్ తదితర మున్నూరు కాపు సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

# ఏటీఎం వసతులు కల్పించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు......

## - మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజ్ యాదవ్ ....



**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజల కోసం గాంధీ ఏరియాలో ఒక బ్యాంకును అదేవిధంగా ఏటీఎం సౌకర్యం కల్పించాలంటూ స్థానిక మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో నోడల్ అధికారి సత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న పెన్షన్ దారులు, మహిళ సంఘాల సభ్యులు డిపాజిట్ మరియు విత్ డ్రా కోసం బస్టాండు వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని దీంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని వెంటనే లీడ్ బ్యాంక్ మేనేజర్ స్పందించి బ్యాంకు తోపాటు ఏటీఎం సౌకర్యం కల్పించాలని బాలరాజు యాదవ్ విన్నవించారు. అదేవిధంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గల క్రిస్టియన్ మతస్థుల వారు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి స్థలం లేదని వెంటనే మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సమాధుల తోటకు స్థలం కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలి

## - పుష్కర ఘాట్ల అభివృద్ధి, గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి

## - పుష్కరాల కోసం అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

## - మంథనిలో పుష్కరాల పనులు, భూసేకరణ అంశాలపై క్షేత్రస్థాయి పర్యటనలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





**మంథని, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి) :**

మంథని పట్టణంలో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం మంథనిలో జిల్లా కలెక్టర్ శ్రీహర్ష పర్యటించి గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు, గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులు, పుష్కరాల కోసం చేపట్టాల్సిన భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో సంబంధిత అధికారులు, రైతులతో పుష్కరాల అవసరాలకు సంబంధించిన ఎండోమెంట్, ఇరిగేషన్ భూసేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంథనిలో అవసరమైన అభివృద్ధి పనులను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల కోసం అవసరమైన భూమిని త్వరితగతిన సేకరించి, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటూనే, పుష్కరాల





పనులకు అవసరమైన భూమిని సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.

### - పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

గోదావరి పుష్కర ఘాట్ల అభివృద్ధికి సంబంధించిన పనులను త్వరగా ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారులు, పార్కింగ్ తదితర సౌకర్యాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు గోదావరి తీరానికి వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఘాట్ల అభివృద్ధి, రహదారుల అనుసంధానం, వాహనాల పార్కింగ్, భద్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.



### - గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

మంథనిలోని గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులను కూడా త్వరగా ప్రారంభించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎండోమెంట్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు, భూసేకరణకు సంబంధించిన అంశాలను వెంటనే పరిష్కరించి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పుష్కరాల పనులకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచి, ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.

### - డిగ్రీ కళాశాలలో అన్ని వసతులు కల్పించాలి

మల్లెపల్లి బాలుర డిగ్రీ కళాశాలను స్థానిక బాలుర పాఠశాల ఆవరణలోకి మార్చిన నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తరగతి గదులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఫర్నిచర్ తదితర అవసరాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణం కల్పించేలా అవసరమైన వసతులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తాసిల్దార్ ఆరిఫోద్దిన్, సంబంధిత శాఖల అధికారులు, ఆర్డీఓ కార్యాలయ అధికారులు, ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల అభివృద్ధిపై సీఎం స్పష్టత ఇవ్వాలి

# పెండింగ్ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతల డిమాండ్



**కోనరావుపేట,సెప్టెంబర్.28(ప్రజాజ్యోతి)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 30న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు, రైతుల సమస్యలపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోనరావుపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్ రావు డిమాండ్ చేశారు.కోనరావుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జిల్లాకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే పర్యటన కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడాలని కోరారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.

### పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల పనులను వెంటనే పూర్తి చేసి రైతులకు నీరు అందించాలన్నారు. గతంలో సుమారు రూ.200 కోట్లతో చేపట్టిన లెఫ్ట్ కెనాల్ పనులకు భూసేకరణ పూర్తయి రైతులకు పరిహారం చెల్లించారని, పంప్‌హౌస్, పైప్‌లైన్ పనులు కొంత మేరకు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేసి మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.మూలవాగు, పెండెవాగులపై బ్రిడ్జిల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. గతంలో రూ.52 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచినా పనులు ముందుకు సాగలేదని, నిధులు, టెండర్లు, నిర్మాణ గడువుపై సీఎం సభా వేదికగా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందించామని, ప్రస్తుతం అంతరాయాలతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని రైతులపై భారం పడుతోందని ఆరోపించారు. మల్కపేట ప్రాంత రైతుల నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భూమ్ రెడ్డి, ఉప సర్పంచ్ తిక్కల నవీన్,మాజీ సర్పంచ్ లు వెన్నమనేని వంశీరావు, గోపు పరశురాములు, మాజీ ఉప సర్పంచ్ పొన్నం పరిశరములు,సీనియర్ నాయకులు,గంగుల ప్రశాంత్,శ్రీరాముల బాబు, పొట్లపల్లి గోపాల్ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**చొప్పదండి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

భారతీయ జనతా పార్టీ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణమాట్లాడుతూ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీ భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లోసమాజం పట్ల సేవాభావాన్ని పెంపొందించడమే కాకుండా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంసేవా సంకల్ప్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని, అందుకే వ్యాసరచన పోటీలు నిర్వహించామని అన్నారు. మోడీ 25 సంవత్సరాల కాలంలో 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా అభివృద్ధి కార్యక్రమాలు, దేశ ప్రజలకు సంక్షేమ పథకాలు క్రింది స్థాయి వరకు అందేలా నిరంతరం పనిచేస్తున్న గొప్ప వ్యక్తి అని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ,ప్రధాన కార్యదర్శి జిట్ట కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండేటి శివశంకర్,బీజేవైయం జిల్లా కార్యవర్గ సభ్యులు మంచికట్ల మల్లేశ్, గుర్రం సమర్, బీజేవైయం పట్టణ అధ్యక్షుడు గంగు సంపత్, మహిళా మోర్చా అధ్యక్షులు పెంచికల రమాదేవి,అర్దవెల్లి శ్రీనివాస్, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, అమరగొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# టోల్ ప్లాజా వద్ద టీబీ, హెచ్ఐవీపై అవగాహన

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్2026'లో భాగంగా బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద టీబీ ముక్త్ భారత్, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా ప్రోగ్రాం అధికారి (హెచ్ఐవీటీబీ) సూచనల మేరకు బసంత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సరళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టోల్ ప్లాజా సిబ్బంది, యువతతో పాటు 60 మందికి పైగా వివిధ రక్త పరీక్షలు, ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. అలాగే రిస్క్ అసెస్‌మెంట్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి వివరాలను సబ్మిట్ చేయించారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్లు యజ్ఞేశ్వర్ రావు, రామకృష్ణ, కన్నబాబు, జిల్లా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ జి. శంకర్, పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ మధు, ఎక్స్‌రే టెక్నీషియన్ రమేష్, సూపర్‌వైజర్ తులసి, ఏఎన్ఎం దీప, ఆశా కార్యకర్తలు పద్మ, లావణ్య, రాజకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యం





**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో నూతనంగా ఏర్పడిన పిఏసిఎస్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పాలకవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసినమున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం ఆర్థిక అభివృద్ధి కోసం దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిది అని గౌరవ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులు బాగుంటేనే గ్రామాలు,పట్టణాలు అభివృద్ధి చెందుతాయనే ముఖ్య ఉద్దేశంతో సహకార సంఘాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సమయంలో సహకారం అందించడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎంతో ముఖ్యమైనవని రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర అవసరాలను సకాలంలో అందిస్తూ వారికి అండగా సహకార సంఘాలు నిలవాలి అని రైతుల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు మన సహకార సంఘం పరిధిలోని 22 గ్రామాల లో ఉన్న రైతులకు ఏ సమస్య వచ్చినా వారి పక్షాన పాలకవర్గ సభ్యుల నిలబడి, సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి అని సహకార సంఘం సభ్యులకు,రైతులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని పుల్కం రాజు అన్నారు,సహకార సంఘం సభ్యులందరూ ఐక్యంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని,తద్వారా రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకరావచ్చు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,ఆత్మ కమిటీ చైర్మన్,ముస్కు ముకుందర్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్,కౌన్సిలర్ కొండ రాజశేఖర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరుణాకర్,ూాజూ కార్యదర్శి, అధికారులు, రైతు సంఘాల సభ్యులు,పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మరిన్ని సేవలు.. సహకార సంఘం కీలక తీర్మానాలు

## - అధ్యక్షులు ముత్యాల బలరాం రెడ్డి

**ధర్మారం, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి న్యూస్):**




నంది మేడారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం సంఘ అధ్యక్షులు,పర్సన్ ఇన్‌చార్జి ముత్యాల బలరాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 26 వరకు సంఘ జమా-ఖర్చులను, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ చేసిన జమా-ఖర్చుల పట్టిక, లాభ-నష్టాల ఖాతా, వ్యాపార ఖాతా, ఆస్తి-అప్పుల పట్టికలను ఆమోదించారు. సభ్యులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయడంతో పాటు వాయిదా మీరిన రుణాలను వసూలు చేయాలని నిర్ణయించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సోలార్ పవర్ ప్లాంట్ ఖర్చులను ఆమోదించారు. అలాగే నంది మేడారం సహకార సంఘం ఎఫ్‌పీఓగా ఎంపికైన నేపథ్యంలో సభ్యులు రూ. 2,000 వాటా ధనం చెల్లించి,కేంద్ర ప్రభుత్వ వాటా ద్వారా లభించే రూ. 2,000తో సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రైతులకు తక్కువ ధరలకు రాయితీపై ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని తీర్మానించారు. రాబోయే సీజన్‌లో సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించేందుకు,సంఘ సొంత నిధులతో సభ్యులకు మార్టిగేజ్ రుణాలు అందించేందుకు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అధ్యక్షులు ముత్యాల బలరాం రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు, విత్తనాలు, జనుము,జీలగ విత్తనాలను అందించడంతో పాటు సంఘం ఆర్థికంగా బలోపేతం కావడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడం, ఇందులో పాలకవర్గ సభ్యులు భాగస్వాములు కావడం గర్వకారణమన్నారు. రైతుల అభివృద్ధి కోసం మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ డైరెక్టర్లు దీటి శ్రీనివాస్, మోర కొమురయ్య, సాయిరి కుమార్, పాలమాకుల తిరుపతిరెడ్డి, ఇస్లావత్ రూప నాయక్, దేవి లింగమ్మ, సంఘ సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# షాహీద్ పాషాకు జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా నియామకం

**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా మొహమ్మద్ షాహీద్ పాషా నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్ చేతుల మీదుగా షాహీద్ పాషా నియామక పత్రాన్ని అందుకున్నారు.వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు షాహీద్ పాషాకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. జిల్లా మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.తనపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించినందుకు షాహీద్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూమ్ మధు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కనికరపు రాకేష్. తో పాటు తనకు సహకరించిన మైనారిటీ నాయకుల కు పార్టీ నాయకులకు షాహీద్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రజాక్. మహమ్మద్ సోహెల్ ఖాన్. మహమ్మద్ పసి ఉద్దీన్. తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

**కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ వివిధ డివిజన్లకు చెందిన ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత సెక్షన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజావాణికి మొత్తం 21 దరఖాస్తులు అందాయి. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 10, ఇంజనీరింగ్‌కు 5, పెన్షన్‌కు 4, రెవెన్యూకు 1, సానిటేషన్ విభాగానికి 1 దరఖాస్తు వచ్చాయి. ప్రధానంగా వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలపై ఇంజనీరింగ్ విభాగానికి, ఆక్రమణల తొలగింపు, అనధికార నిర్మాణాలు, అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు అందాయి.అలాగే రెవెన్యూ విభాగంలో పన్ను సవరణ, నూతన ప్రాపర్టీ నమోదు, ఇందిరమ్మ తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. పెన్షన్, పారిశుధ్య సమస్యలపై కూడా ప్రజలు అర్జీలు సమర్పించారు.ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీపీ బషీరొద్దీన్, ఏసీపీ వేణు, శ్రీధర్, డీఈ ఓం ప్రకాష్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.




# చదువుతోనేసమాజంలోగౌరవం

## - ఉజ్వల భవిష్యత్తు

## - తూమ్ మధు, కౌన్సిలర్

**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ స్వంత ఖర్చులతో విద్యార్థులకు టై,ఐడి కార్డ్స్ , బెల్టులను తెప్పించి, కౌన్సిలర్ తో మధు గారిచే విద్యార్థులకు వితరణ చేయనైనది. ఈ సందర్భంగా కౌన్సిలర్ తూమ్ మధు మాట్లాడుతూ "ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ టై, ఐడి కార్డ్స్, బెల్టులను వితరణ చేయడం ప్రశంసనీయమని, చదువు ద్వారా లోకజ్ఞానం, విచక్షణా జ్ఞానం పెరుగుతాయని, నాణ్యమైన విద్య మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిస్తుందని, విద్య మనిషికి ఆత్మవిశ్వాసాన్ని, మంచి ప్రవర్తనను నేర్పుతుందని, కుటుంబంలో ఆర్థిక భద్రత ఏర్పడి, పేదరికం తొలగిపోవడానికి చదువే మొదటి మెట్టు అని, చదువుకున్న వారితోనే సమాజంలో సమానత్వం, శాంతి మరియు దేశ అభివృద్ధి సాధ్యమవుతాయని, ఉజ్వల భవిష్యత్తు కోసం విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, చదువులో రాణించి తమ ఉజ్వల భవిష్యత్తు కోసం ఉన్నతంగా ఎదగాలని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, నాయకుడు భాస్కర్ విద్యార్థులు పాల్గొన్నారు.



# సీఎం సభను విజయవంతం చేయాలి

## - ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలిరండి : మండల అధ్యక్షులు మానుక సత్యం

**కోనరావుపేట,సెప్టెంబర్. 28(ప్రజాజ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా ఆయన పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కోనరావుపేట మండల అధ్యక్షుడు మానుక సత్యం పిలుపునిచ్చారు.కొనరావుపేట మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, రైతులు, మహిళలు, యువత, కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని, ఈ సభ జిల్లా ప్రజలకు ఎంతో ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు.కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రజలను సభకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య,సింగల్ విండో చైర్మన్ చేపూరి గంగాధర్ గుప్తా,జిలా ప్రధాన కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా, గొట్టే రుక్మిణి,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, సర్పంచులు దేవరాజ్,నరేష్ నాయక్, లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ కచ్చకాయల బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు నాయిని ప్రభాకర్ రెడ్డి, అజీమ్ పాషా,బాశెట్టి నాగరాజు, సింగిల్ విండో డైరెక్టర్ నాలుక సత్యం, నిరటి సురేష్,శ్రీధర్,సదానందం,



# గ్రామ సభలో ఈజీఎస్ పనుల గుర్తింపు పల్లిమక్తలో సర్పంచ్ అనూష అధ్యక్షతన సమావేశం

**కోనరావుపేట,సెప్టెంబర్.28(ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. 2027-28 సంవత్సరానికి సంబంధించిన విబిజి రాంజీ (ఈజీఎస్) పనుల గుర్తింపు కోసం ఈ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఏ రాజు ఈజీఎస్ లో చేపట్టే పనులపై ప్రజలకు పూర్తి సమాచారం వివరించారు.జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పొలాల్లో పొలం కుంటలు, బోర్ల వద్ద బోర్ వెల్ రీచార్జ్ గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామ ముఖచిత్ర పటాన్ని ఏర్పాటు చేసి గతంలో చేపట్టిన ఈజీఎస్ పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. అలాగే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, కార్యదర్శి రజిత, వార్డు సభ్యులు జాగిరి లక్ష్మి, చిద్రవేణి నరేష్, జిన్న సమత అర్జున్, అంగన్ వాడీ టీచర్ దేవేంద్ర, రేషన్ డీలర్ అరుణ, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భవిష, సీఏ మహిత, ఆశా వర్కర్ కనకలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల ఇళ్ల కలకు మరింత ఊతం!

## వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా లాయక్ పాషా ఏకగ్రీవం

## విప్ ఆది శీనన్న సహకారంతో మరింత ముందుకు

**వేములవాడ,సెప్టెంబర్,28: ప్రజాజ్యోతి.**

వేములవాడ ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందించడంతోపాటు ఇప్పటికే మంజూరైన స్థలాలతో ఏర్పడుతున్న జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగేందుకు వేములవాడ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి లాయక్ పాషాను చైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమిస్తూ ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

### మంజూరైన స్థలాల అభివృద్ధిపై దృష్టి..

వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో సర్వే నంబర్ 391లో జర్నలిస్టుల కోసం మంజూరైన నివేశన స్థలాలతో కాలనీ రూపుదిద్దుకుంటోంది,అయితే స్థలాలు మంజూరు కావడం ఒక దశ మాత్రమేనని వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ లాయక్ పాషా తెలిపారు.

### 60 మంది జర్నలిస్టుల స్థలాల కోసం గతంలో ప్రయత్నం..

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన ప్రక్రియలో గతంలోనూ లాయక్ పాషా కీలకంగా పనిచేశారు, సుమారు 60 మంది జర్నలిస్టులకు నివేశన స్థలాలు కల్పించేందుకు జరిగిన ప్రయత్నాల్లో ముఖ్య భాగస్వామ్యం కావడంతో పాటు, ప్రస్తుతం ఏర్పడుతున్న కాలనీకి సంబంధించిన పలు అంశాలపై అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు.

### కాలనీలో తొలి అడుగులు

జర్నలిస్టు కాలనీలో మొట్టమొదటిసారిగా బొడ్రాయి ఏర్పాటు చేసి నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం, ఇంటి నంబర్ తీసుకోవడం వంటి కార్యక్రమాలు లాయక్ పాషా ఆధ్వర్యంలోనే జరిగాయి. కాలనీకి విద్యుత్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది
ఇవి కాలనీ నిర్మాణానికి ప్రాథమిక వసతులు
ఏర్పడుతున్నాయనడానికి సంకేతాలుగా నిలుస్తున్నాయి.

### నీటి సమస్యకు రెండు బోర్లు..

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు లాయక్ పాషా తెలిపారు. జర్నలిస్టు కాలనీ అవసరాలను వివరించడంతో రెండు బోరుబావులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు, నీటి వసతి ఏర్పాటైతే కాలనీలో నిర్మాణ పనులు, భవిష్యత్తులో నివాసం ఏర్పరుచుకునే కుటుంబాలకు కొంతమేర ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

### మిగిలిన అర్హులకూ స్థలాలే లక్ష్యం..

ప్రస్తుతం మంజూరైన స్థలాలతో పాటు ఇంకా కొంతమంది అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందాల్సి ఉందని లాయక్ పాషా తెలిపారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి స్థలాల సాధనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

### సొసైటీ ముందున్న అసలు సవాలు ఇదే..

హౌసింగ్ సొసైటీకి చైర్మన్ నియామకంతో బాధ్యత పూర్తికాదని, ఇప్పటికే మంజూరైన స్థలాలను పూర్తి స్థాయి జర్నలిస్టు కాలనీగా తీర్చిదిద్దడమే అసలు సవాలన్నారు...వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమంపై మరింత ముందుకు సాగుతామన్నారు. భూమి, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో పాటు అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు స్థలాల సాధన, ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం వంటి అంశాలు సొసైటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో హౌసింగ్ సొసైటీని సమర్థవంతంగా నిర్వహిస్తూ



జర్నలిస్టులందరి భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవ నియామకంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిస్టుల ప్రయోజ నాల కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని లాయక్ పాషా తెలిపారు.హౌసింగ్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన లాయక్ పాషకు పుర ప్రముఖులు, న్యాయ వాదులు, జర్నలిస్టు సంఘం నాయకులు, సహచర జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

---

# భారతదేశ అభివృద్ధికి మాదకద్రవ్య రహిత యువత కావాలి ....

## - క్యాతం సత్యనారాయణ

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు ,కుటుంబం, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని అలవరుచుకోవాలనీ, దేశ ప్రగతిలో యువత కీలక పాత్ర పోషిస్తుందని , విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాలవైపు దృష్టి సారించాలనీ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు అన్నారు. సెప్టెంబర్ 28న యెల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలమేరకు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో "నషా ముక్తి యువ ఫర్ భారత్ వికసిత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా " ప్రతిజ్ఞ" చేశారు. అనంతరం కళాశాల నుండి బస్టాండ్ వరకు ఆంటిడ్రగ్ పై స్లోగన్లతో ర్యాలీ నిర్వహించారు.కళాశాల ఇంచార్జీ క్యాతం సత్యనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాలు పూర్తిగా విడనాడాలని శ్రమజీవనానికి అలవాటుపడి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధిం చాలని , విద్యార్థులు తల్లిదండ్రులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు గురువులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని




అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జీ క్యాతం సత్యనారాయణ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి,చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, గజ్జెల గంగాధర్, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, నిఖిల్ , ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

---

# వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు జాతీయ ఆరోగ్య మిషన్‌లో 40 పోస్టులకు అవకాశం

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి**

;జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం కింద పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వై. పవిత్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ 8, స్టాఫ్‌నర్స్ 15, ఎంఎల్‌హెచ్‌పీ 8, ఎస్టీఎల్ఎస్ 2, ఏఎన్ఎం 3, ఫార్మసిస్ట్ 1, పాథాలజిస్ట్ 1, ఓబీజీ స్పెషలిస్ట్ 2 పోస్టులు కలిపి మొత్తం 40 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర పూర్తి వివరాలను పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్ఓ వై. పవిత్ర సూచించారు.



# సమర్థవంతమైన బోధనతోనే విద్యార్థుల్లో నాణ్యమైన ఫలితాలు..

## ముత్తారంలో ఉన్నత పాఠశాల స్థాయి ఆంగ్ల ఉపాధ్యాయుల సముదాయ సమావేశం

### హాజరైన నాలుగు మండలాల ఉపాధ్యాయులు..

**ముత్తారం, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

తరగతి గదిలో సమర్థవంతమైన బోధన ద్వారానే విద్యార్థుల్లో నాణ్యమైన అభ్యసన ఫలితాలు సాధ్యమవుతాయని ముత్తారం మండల విద్యాధికారి ఎన్. హరిప్రసాద్, సముదాయ ప్రధానోపాధ్యాయురాలు పద్మాదేవి పేర్కొన్నారు. సోమవారం ముత్తారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఉన్నత పాఠశాల స్థాయి సముదాయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రామగిరి, మంథని, కాల్వ శ్రీరాంపూర్, ముత్తారం మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా వనరుల వ్యక్తి, జిల్లా పరిశీలకులు గడ్డం జగదీశ్వర్ (జి. జగదీష్)తో పాటు డి. నాగరాజు, కె. శ్రీనివాస్, సిహెచ్. రాజ్‌కుమార్ ఉపాధ్యాయులకు బోధనాభ్యసన ప్రక్రియలపై సమగ్ర శిక్షణ, మార్గదర్శకాలను అందించారు. ఈ సందర్భంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన, ప్రశ్నల సరళి, నిర్మాణాత్మక మరియు సంగ్రహణాత్మక మూల్యాంకన ప్రశ్నపత్రాల శాస్త్రీయ రూపకల్పన, బోధనాభ్యసన ప్రణాళిక తయారీ, ప్రదర్శన పాఠాలు, బ్లూప్రింట్ ఆధారిత మూల్యాంకన సూత్రాలు, అభ్యాస పుస్తకాల సమీక్ష తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు నూతన బోధనా మెళకువలను అందిపుచ్చుకోవాలని, అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వక్తలు సూచించారు. ఉపాధ్యాయులు తమ బోధనా అనుభవాలను పరస్పరం పంచుకుంటూ ఈ సమావేశాన్ని విజయవంతం చేశారు.



# మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## కొనరావుపేట జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం

**కొనరావుపేట, సెప్టెంబర్.28(ప్రజా జ్యోతి)**

కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'నషా ముక్తి యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, స్టూడెంట్ కౌన్సిలర్ బి. భూమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కోనరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి (ఎంహెచ్ఓ) జె. సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైతే ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని, విద్యార్థులు తమ జీవితాన్ని బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. బి భూమేష్ మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని, వాటికి దూరంగా ఉంటూ శారీరక, మానసిక అభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, పీహెచ్‌సీ సూపరింటెండెంట్ రక్షణ్, అధ్యాపకులు సుధాకర్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, భారత్, నాన్‌టీచింగ్ సిబ్బంది కర్ణాకర్‌తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# పారుపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం.. గ్రామస్తుల హర్షం!

## సర్పంచ్ చొప్పరి సంపత్ కృషితో

### నెరవేరిన గ్రామ ప్రజల కల..



**ముత్తారం, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

మారుమూల పల్లెలను ప్రగతిపథంలో నడిపించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రయత్నాల్లో భాగంగా పారుపల్లి గ్రామానికి ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. స్థానిక సర్పంచ్ చొప్పరి సంపత్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో గ్రామానికి బస్సు సర్వీస్ ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు గ్రామ ప్రజలు, విద్యార్థులు పడుతున్న తీవ్ర రవాణా ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ సంపత్, తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ గోదావరిఖని డిపో మేనేజర్‌ను పలుమార్లు స్వయంగా కలిసి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన గోదావరిఖని డీఎం.. జమ్మికుంట నుంచి గోదావరిఖని మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సును నేరుగా పారుపల్లి గ్రామం మీదుగా నడిపించేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం బస్సు తొలిసారి గ్రామంలోకి ప్రవేశించగా గ్రామస్తులు, మహిళలు, యువకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. త్వరలోనే పెద్దపల్లి మార్గంలో నడిచే బస్సును కూడా గ్రామం లోపలి నుంచే నడిపించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకాన్ని గ్రామ మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రజల సమస్యను పరిష్కరించిన గోదావరిఖని డిపో మేనేజర్‌కు గ్రామస్థుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంబటి చంద్రమౌళి, గ్రామ యువజన సంఘం అధ్యక్షుడు కారుపాకాల శ్రీకాంత్, మాజీ వైస్ ఎంపీపీ తిరుమలరావు, బైరాం రాజు, రాజశేఖర్, పీక శంకర్, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే దాసరి పెద్దపల్లి నియోజకవర్గ సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చ



**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలతో పాటు ప్రజా సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ కార్యకలాపాలపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తదితర అంశాలపై కూడా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం సమన్వయంతో ముందుకు సాగుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి

## - క్షణకాలపు నిర్లక్ష్యం.. కుటుంబానికి మిగిల్చిన జీవితాంతం విషాదం

**రామగిరి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి) :**

సెంటినరీ కాలనీలో జరిగిన రోడ్డు ప్రమాదం మరోసారి అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్‌పై తీవ్రంగా ఆలోచించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది. వేగం తగ్గించుకోవాల్సిన చోట అదే వేగంతో వాహనం నడపడం, రహదారిపై పరిస్థితులను అంచనా వేయకపోవడం, మలుపుల వద్ద నియంత్రణ కోల్పోవడం వంటి చిన్నచిన్న నిర్లక్ష్యాలు ఒక్కోసారి నిండు ప్రాణాలను బలిగొంటున్నాయి. కమాన్పూర్ మండలంలోని గుండారం గ్రామంలో గల రాజాపూర్‌కు చెందిన 22 ఏళ్ల బిజిగిరి సంజయ్ కుమార్ మృతి వారి కుటుంబానికి తీరని విషాదం మిగిల్చింది.

**మలుపు వద్ద అదుపు తప్పి :**

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్ కుమార్ సెప్టెంబర్ 27న మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో సెంటినరీ కాలనీ నుంచి కమాన్‌పూర్ వైపు వస్తుండగా.. పోస్ట్‌ఆఫీస్ సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంజయ్‌ను కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**వేగం.. ప్రమాదానికి తొలి కారణం :**

రోడ్డుపై వాహనం నడుపుతున్నప్పుడు వేగం పెరిగిన కొద్దీ వాహనంపై నియంత్రణ తగ్గుతుంది. ముఖ్యంగా మలుపులు, కూడళ్లు, జనావాస ప్రాంతాలు, రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. ముందున్న అడ్డంకిని గుర్తించినా వెంటనే బ్రేక్ వేయడానికి తగినంత సమయం లేకపోవచ్చు. ఒక్కసారిగా ఎదురయ్యే వాహనం, పాదచారి, జంతువు లేదా రహదారి మలుపు.. ఏదైనా ప్రాణాంతక ప్రమాదానికి దారితీయవచ్చు. అందుకే అతివేగం కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు.. ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే నిర్ణయం.

**యువత మరింత అప్రమత్తంగా ఉండాలి :**

ద్విచక్ర వాహనాల వినియోగం పెరిగిన నేపథ్యంలో యువత రహదారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. వాహనం ఎంత శక్తివంతమైనదైనా.. రహదారి పరిస్థితులు, వాహనాల రద్దీ, మలుపులు, వెలుతురు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని వేగాన్ని నియంత్రించాలి. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకపోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

**కుటుంబం కోసం.. వేగాన్ని తగ్గిద్దాం :**

ఒక ప్రమాదంలో ప్రాణం కోల్పోయేది ఒక్క వ్యక్తి మాత్రమే కాదు.. అతడిపై ఆధారపడిన కుటుంబం కూడా తీవ్రంగా నష్టపోతుంది.




ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కోసం కుటుంబ సభ్యులు తిరిగి వస్తాడని ఎదురుచూస్తుంటారు. ఆ ఎదురుచూపు విషాదంగా మారకుండా ప్రతి వాహనదారుడు తన బాధ్యతను గుర్తుతెరగాలి. ఎంత తొందర ఉన్నా గమ్యస్థానానికి కొన్ని నిమిషాలు ఆలస్యంగా చేరడం పరవాలేదు.. కానీ ప్రాణాలను పణంగా పెట్టి వేగంగా వెళ్లాల్సిన అవసరం లేదు. వేగం గమ్యాన్ని త్వరగా చేరుస్తుందేమో.. కానీ అదుపు తప్పిన వేగం ఆ కుటుంబ గమనాన్నే అతలాకుతలం చేస్తుంది.

# నిందితులకు శిక్షలు పడేలా సమన్వయంతో పనిచేయాలి

## - పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం అవసరం

## - రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ



**మంథని, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

నిందితులకు శిక్షలు పడేలా పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. బాధితులకు న్యాయం జరగాలంటే అసలైన నేరస్థులకు శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు చేపట్టాలన్నారు.సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని వివిధ కేసుల దర్యాప్తు, విచారణ, పెండింగ్ కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులతో సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కేసుల విచారణలో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కూడా అత్యంత కీలకమన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు ప్రతి దశలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోర్టులో విచారణ సమయంలో అవసరమైన సాక్ష్యాధారాలను, సాక్షులను సమర్థవంతంగా సమర్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో ఎక్కడైనా సమన్వయ లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.గుడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా కేసుల విచారణను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిందితులకు శిక్షలు పడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. దీంతో బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన న్యాయవ్యవస్థ కోసం పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్, మంథని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అర్థ కుమార్, మంచిర్యాల, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహీదా ఫర్హీన్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ లు పాల్గొన్నారు.

# కోతుల బెడద నివారణకు అత్యవసర సమావేశం

**ముస్తాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):**

తెర్లుమద్ది గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన చీటిపాక నర్సవ్వ అనే వృద్ధురాలిపై కోతులు దాడి చేసి కరిచిన ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది.ఈ ఘటనపై వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ ఆదేశాల మేరకు గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, ప్రజలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెరుగుతున్న కోతుల బెడద, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.కోతుల బెడదను నియంత్రించేందుకు కొంతమందిని ఏర్పాటు చేసి, కోతులకు ఎలాంటి హాని కలగకుండా వాటిని సురక్షితంగా గ్రామ పరిధి నుంచి బయటకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.ప్రజల భద్రత దృష్ట్యా కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారుల సహకారం తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైతి దుర్గమ్మ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి చెస్ పోటీలో అల్ఫోర్స్ విద్యార్థికి ద్వితీయ స్థానం

**కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి జి. శివాస్ అండర్-15 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించి రజత పతకంతో పాటు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నాడు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అభినందన కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శివాస్‌ను అభినందించి సన్మానించారు. చెస్ క్రీడ ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా విధానం, సృజనాత్మకత, ఏకాగ్రత పెరుగుతాయని ఆయన అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడంతో పాటు స్నేహభావం, సత్సం బంధాలను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి క్రీడలు కీలకమని, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వివిధ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ శివాస్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

## - సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ల గుర్తింపు..

## పోలీసులకు బాధితుల కృతజ్ఞతలు

**జమ్మికుంట, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):**

జమ్మికుంట పట్టణ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు గుర్తించి వాటి యజమానులకు తిరిగి అప్పగించారు. పట్టణ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఈఐఆర్ (జజు×=) పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదులపై పోలీసులు చర్యలు చేపట్టారు.సీఈఐఆర్ ఆపరేటర్ కానిస్టేబుల్ సౌమ్య పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేశారు. ఈ క్రమంలో సోమవారం ఐదు మొబైల్ ఫోన్లను వాటి యజమానులకు పట్టణ సీఐ రామకృష్ణ చేతుల మీదుగా అప్పగించారు.మొబైల్ ఫోన్లు అందుకున్న వారు కొమ్ము ప్రేమ్ కుమార్  ఎండీ రియాజుద్దీన్ గాదె రాములు ఎండీ సాదిక్ యాద వెంకటాచలం పోగొట్టుకున్న తమ మొబైల్ ఫోన్లను తిరిగి అందజేసిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.




# దేశ స్వాతంత్ర్యం కోసం ఉరితాడును ముద్దాడిన విప్లవ వీరుడు.

## – భగత్ సింగ్ తూమ్ మధు, కౌన్సిలర్

**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన గొప్ప విప్లవీరుడు భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా కౌన్సిలర్ తూమ్ మధు మాట్లాడుతూ"భగత్ సింగ్.. ఈ పేరు వింటేనే రోమాలు నిక్కబొడుచుకుంటాయని, యువకుల రక్తం మరిగిపోతుందని, ఆయన స్వాతంత్ర్య పోరాట శైలి నేటి యువతకు ఆదర్శం, స్ఫూర్తిదాయకమని, భారత దేశ బానిసత్వ సంకెళ్లను తెంచేందుకు భగత్ సింగ్ చేసిన పోరాటం ఎనలేనిదని, ఉరితాడును ముద్దాడుతూ.. చావు చివరి క్షణంలో కూడా దేశభక్తిని కళ్ళలో నిలుపుకున్న ధీరుడు భగత్ సింగ్ అని, ఆయన 1907 సెప్టెంబర్ 28న పంజాబ్ లోని బంగా గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి కౌర్ దంపతులకు జన్మించారని, జలియన్వాలాబాగ్ దుర్ఘటన భగత్ సింగ్ మనస్సుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిందని, చిన్న వయస్సు లోనే ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని నిర్ణయించుకున్నారని, భగత్ సింగ్ 'ఇంక్విలాబ్ జిందాబాద్'(విప్లవ వర్ధిల్లాలి) అనే నినాదంతో ప్రజలలో దేశభక్తిని రగిలించాడని, దేశం కోసం ప్రాణాలనైనా త్యాగం చేయడానికి ఆయన ఎప్పుడూ వెనుకాడలేదని, బ్రిటిష్ పాలకులపై పోరాడుతూ ఆయన లాహోర్ కుట్ర కేసులో అరెస్టయ్యారని, 1931 మార్చి 23న ఆయన దేశం



కోసం ప్రాణ త్యాగం చేసి ఉరికంబం ఎక్కారని, ఉరితాడు మెడలో వేసుకునే ముందు భగత్ సింగ్ దాన్ని ముద్దాడారని, 23 ఏళ్ల అతి చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణ త్యాగం చేయడం ద్వారా ఆయన కోట్లాదిమంది భారతీయ యువతకు ఎప్పటికీ నిలిచిపోయే ధైర్యసాహసాల ప్రతీకగా, జాతీయ హీరోగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిపోయారని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీ నారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, నాయకుడు భాస్కర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్లకు భవనం

## ప్రభుత్వ స్థలం కేటాయించాలి......తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ప్రతినిధులు.....

**ఎల్లారెడ్డిపేట , సెప్టెంబర్ 28:(ప్రజా జ్యోతి)**

వృద్ధుల సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వెంకటాపూర్ గ్రామ సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ దివ్యజ్యోతికి వినతిపత్రం సమర్పించారు. వెంకటాపూర్ గ్రామంలో సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘంలో సుమారు 200 మంది సభ్యులు ఉన్నారని ప్రతినిధులు తెలిపారు. వృద్ధులు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు భవిష్యత్తులో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసుకునేందుకు అనువైన స్థలం అవసరమని పేర్కొన్నారు.గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో సర్వే నంబర్ 349లో 0.23 గుంటలు, సర్వే నంబర్ 374లో 0.29 గుంటలు, సర్వే నంబర్ 396లో భూమిలేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వగా మిగిలిన ప్రభుత్వ భూమిని సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కేటాయించాలని కోరారు. అలాగే వృద్ధులు సేదతీరేందుకు, చెట్ల కింద కూర్చొని సమయం గడిపేందుకు ఉద్యానవనం ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీకి



కేటాయించిన లేఅవుట్ స్థలాల్లో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్ని సీనియర్ సిటిజన్ల ఉద్యానవనం కోసం కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం అధ్యక్షుడు కొంపెల్లి నరసయ్య, ప్రధాన కార్యదర్శి మునిగే చంద్రయ్య, ఉపాధ్యక్షురాలు మామిళ్ల లక్ష్మి, సంయుక్త కార్యదర్శి గొట్టె ఎల్లయ్య, కోశాధికారి పొన్నాల రాజయ్య, కార్యవర్గ సభ్యులు దుండిగాల నరసయ్య, పొన్నాల లింగయ్య, వడ్నాల ఎల్లయ్య, గొట్టె దేవయ్య తదితరులు ఉన్నారు.

# పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ధర్మారం, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి న్యూస్):**

మండలం లోని దొంగతుర్తి గ్రామానికి చెందిన జుంజుపల్లి నారాయణ (60) సోమవారం ఉదయం తన ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో నారాయణ కుడికాలుకు ఇన్ఫెక్షన్ కావడంతో తీవ్ర నొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు మేరకు ఎస్సై ఎంబడి శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, నారాయణ భార్య గత 15 ఏళ్లుగా మనస్పర్థల కారణంగా ఆయనకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, ముగ్గురికీ వివాహాలు జరిగినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.



# గ్రామఆలయాల్లో దొంగతనాలు -నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

## వేములవాడ రూరల్ ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి

**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నూకలమర్రి గ్రామంలో గల ఎల్లమ్మ దేవాలయం, పెద్దమ్మ దేవాలయం, అలాగే బాలరాజుపల్లి గ్రామంలోని పెద్దమ్మ దేవాలయంలో నిన్న 27-09-2026 అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి దొంగతనాలు చేశారు అని వేములవాడ రూరల్ ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.వివరాలు..ఆలయాల్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని దొంగలు అక్కడ భద్రపరిచిన బంగారు ఆభరణాలు, నగదు మరియు ఇతర విలువైన వస్తువులను అపహరించినట్లు ప్రాథమికంగా గుర్తించబడింది. ఈ ఘటనలపై సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలాలను పరిశీలించి, ఆధారాలను సేకరించటం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది. చోరీలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి పట్టుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించాం అని. సంఘటనా స్థలాల పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు, అనుమానిత వ్యక్తుల కదలికలు మరియు ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నాము అని .ఇటీవల ఆలయాల లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఆలయ నిర్వాహకులు రాత్రి వేళల్లో ఆలయాల్లో నగదు,




బంగారు ఆభరణాలు ఇతర విలువైన వస్తువులను ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని .ప్రతీ దేవాలయం వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి, ఆలయాల వద్ద తగిన లైటింగ్ ఏర్పాటు చేసి రాత్రి వేళలో కూడా వెలుతురు ఉండేలా లైట్ లు వేసి ఉంచాలి అని ,గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# ఎంబీబీఎస్ పరీక్షల్లో ఫెయిల్.. విద్యార్థి ఆత్మహత్య

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 28,(ప్రజాజ్యోతి):**

ఎంబీబీఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేక మానసిక వేదనకు గురైన నాగడి పునీత్‌వర్మ (28) అనే విద్యార్థి సోమవారం అధిక మోతాదులో మందులు తీసుకుని మృతిచెందిన ఘటన కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా తాడిగడపకు చెందిన పునీత్‌వర్మ 2019లో కౌన్సెలింగ్ ద్వారా బొమ్మకల్‌లోని చల్మెడ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో చేరాడు.కొన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమవుతున్నాడు.ఈ క్రమంలో మానసిక వేదనకు గురై బెంజోడియాజిపైన్ తరహా మాత్రలను అధిక మోతాదులో తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు.కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు,



# వేములవాడ కాంగ్రెస్ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్

**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ రజాక్ నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు రియాజ్ చేతుల మీదుగా అబ్దుల్ రజాక్ నియామక పత్రాన్ని అందుకున్నారు.కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా, ముస్లిం మైనార్టీ వర్గాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న అబ్దుల్ రజాక్‌ను వేములవాడ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, మాజీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు తన నియామకానికి సహకరించిన మైనార్టీ నాయకులు, పార్టీ శ్రేణులందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేములవాడ



పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అబ్దుల్ రజాక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ నాయకులుమహమ్మద్ షాహిద్ పాష. మొహమ్మద్ సోహెల్ ఖాన్. మహమ్మద్ ఫసి ఉద్దీన్. సయ్యద్ షబ్బీర్. ఎదురుగట్ల రాము. మరియు తదితరులు పాల్గొన్నారు.

# రంగరావుపల్లిలో గ్రామ సభ.. అభివృద్ధి పై చర్చ

**గంగాధర సెప్టెంబర్ 28: (ప్రజా జ్యోతి)**

గంగాధర మండలం రంగరావుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభను నిర్వహించారు. వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (విజీపీపీ)లో భాగంగా చేపట్టబోయే నూతన అభివృద్ధి పనుల వివరాలను గ్రామస్థులు, పాలకవర్గ సభ్యులకు పంచాయతీ కార్యదర్శి గోడిశాల మౌనిక సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి శంకరయ్య, ఉప సర్పంచ్ ద్యవ బహదూర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# గంజాయి స్మగ్లింగ్.. హిస్టరీషీట్ నిందితుడు అరెస్ట్

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 28,(ప్రజాజ్యోతి):**

గంజాయి అక్రమ రవాణా,విక్రయానికి పాల్పడుతున్న హిస్టరీ షీట్ నిందితుడుని కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 1.140 కిలోల గంజాయి, శాంసంగ్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొగ్దుమ్ పూర్ మైత్రి ఫ్యామిలీ దాబా సమీపంలో అనుమానాస్పదంగా ప్లాస్టిక్ కవర్‌తో తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది.నిందితుడు బుర్రవ వంశీ (24)గా పోలీసులు గుర్తించారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి కరీంనగర్ పరిసరాల్లో యువకులు, హైవే దాబాల వద్ద లారీ డ్రైవర్లకు చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.నిందితుడుపై గతంలోనూ రామగిరి, కరీంనగర్ రూరల్‌తో పాటు ఒడిశాలో గంజాయి కేసులు నమోదైనట్లు,అతడిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హిస్టరీ షీట్ ఉన్నట్లు పేర్కొన్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐ ఏ. లక్ష్మారెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిమ్మపల్లిలో వృద్ధురాలిపై కోతుల దాడి

## స్పృహ కోల్పోయిన బాధితురాలు..

## సిరిసిల్ల ఆస్పత్రికి తరలింపు

**కోనరావుపేట,సెప్టెంబర్.28(ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో కోతుల దాడి కలకలం రేపింది. గ్రామంలోని 2వ వార్డుకు చెందిన ఎరుకల భూదవ్వ అనే వృద్ధురాలిపై కోతులు దాడి చేశాయి.ఈ దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలై రక్తస్రావం ఎక్కువ కావడంతో ఆమె స్పృహ కోల్పోయింది. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆమెను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఇటీవల గ్రామంలో కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి చొరబడి భీభత్సం సృష్టిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలని అధికారులను కోరుతున్నారు.




# రెండు రోజులుగా గదిలోనే మృతదేహం

## దుర్వాసన రావడంతో వెలుగులోకి

## ఆదర్శనగర్‌లో ఘటన

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

ఆదర్శనగర్‌లో ఓ వృద్ధుడు అద్దె గదిలో మృతి చెంది రెండు రోజుల పాటు మృతదేహం అలాగే ఉండిపోయింది.గది నుంచి దుర్వాసన రావడంతో పక్కింటి వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది.కరీంనగర్ త్రీటౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మానకొండూరుకు చెందిన కొంపెల్లి శంకరయ్య (70),ఆదర్శనగర్‌లో అద్దెకు ఉంటూ కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న శంకరయ్య రెండు రోజుల క్రితం తన గదిలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సోమవారం గది నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా శంకరయ్య మృతదేహం కనిపించింది.మృతదేహం కుళ్ళిపోయి ఉండటంతో రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు గుర్తించారు.మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు.శంకరయ్య మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని, అనారోగ్య కారణాలతోనే మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.దీంతో వారి అభ్యర్థన మేరకు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సిఐ తెలిపారు.



# సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు

## సర్వసభ్య సమావేశంలో చైర్మన్ గంగాధర్ వెల్లడి

**కోనరావుపేట,సెప్టెంబర్.28(ప్రజాజ్యోతి)**

సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని రైతుల సంక్షేమమే సింగిల్ విండో ప్రధాన లక్ష్యమని, కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ చేపూరి గంగాధర్ అన్నారు.కోనరావుపేట మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో తనకు చైర్మన్ పదవి దక్కిందని తెలిపారు. పదవికి ఎలాంటి మచ్చ రాకుండా రైతులకు నాణ్యమైన సేవలు అందించి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.సహకార సంఘం పరిధిలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సకాలంలో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందజేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం అభివృద్ధికి డైరెక్టర్లతో పాటు సిబ్బంది కూడా కృషి చేయాలని



పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సర్పంచ్ కాశీరాం లక్ష్మారెడ్డి, కేడీసీసీ మేనేజర్ దేవరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుక సత్యం, సంఘం డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం..

## వ్యక్తికి తీవ్ర గాయాలు....

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి:)**

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని రామ భిక్షపతి వాటర్ ప్లాంట్ ఎదురుగా రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న గంభీరావుపేటకు చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, గాయపడిన వ్యక్తి పరిస్థితి, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# వికసిత్ భారత్ గ్యారెంటీ పనులకు శ్రీకారం

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి):-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మనగర్ లో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ గ్రామీణ్ పని లో భాగంగా కొత్తగా వచ్చిన 375 రకాల పనులను గుర్తించుటకు సోమవారం మహాత్మనగర్ గ్రామసభ నిర్వహించడం జరిగింది దీనిలో భాగంగా గ్రామం యొక్క సోషల్ అలాగే రిసోర్స్ మ్యాప్ అక్కడ గీసి గ్రామం లో ఇదివరకి చేసినపనులు,అలాగే భవిష్యత్తులో చేయబోయే అన్ని రకాల పనుల గురించి మాట్లాడుకోవడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్ ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి, శ్రీనివాస్ కారోబార్ జవహర్ ఏపీవో ,గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.



# సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయండి

## - ప్రభుత్వ విప్పు వీరేశం ....

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి.)....**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్పు ఎమ్మెల్సీ వీరేశం కోరారు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వీరేశం మాట్లాడుతూ 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగే సీఎం రేవంత్ రెడ్డి సభకు ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు, గత బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకొని దాసుకుందని 700 వేల కోట్ల రూపాయల అప్పులపాలు చేసి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అయినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమాన్ని చేపడుతుందని అన్నారు, మహిళలను రైతులను లక్షాధికారులను చేయడమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ పనిచేస్తుందన్నారు, పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదు అన్నారు, సీఎం రేవంత్ రెడ్డి రేషన్ కార్డులతో పాటు ప్రతి పేదవాడు పెద్దోనితో సమానంగా తినే విధంగా సన్న బియ్యం రైతు భరోసా 500 కే గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించి సభకు పెద్ద ఎత్తున తరలించాలని పిలుపునిచ్చారు, ఈ సమావేశంలో రాష్ట్ర సంస్కృతిక మండలి డైరెక్టర్ దరువు ఎల్లన్న , గంభీరావుపేటక్క, పార్టీ మండల అధ్యక్షులు తిరుపతి గౌడ్ ,సర్పంచ్ ల పోరం మండల అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి నాయకులు నేవూరి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి చేపూరి రాజేశం గుప్తా సాహెబ్ వంగ గిరిధర్ రెడ్డి బండారి బాల్రెడ్డి, రాములు వంగ శ్రీకాంత్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు గ్రామ శాఖల అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సొసైటీని లాభాల బాటలో నడిపిస్తాం: వేములవాడ ప్యాక్స్ చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్

## - విప్ ఆది శ్రీనివాస్ చొరవతో రైతాంగానికి నాణ్యమైన సేవలు: ప్యాక్స్ పాలకవర్గం

**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే అత్యున్నత సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని (ప్యాక్స్) మరిన్ని రంగాల్లో విస్తరించి, మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తూ లాభాల బాట పట్టిస్తామని సంఘం చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం వేములవాడ ప్యాక్స్ సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సాధించిన ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణను సభ్యుల ముందు ఉంచారు. ఈ సందర్భంగా చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ... తమ పాలకవర్గంపై ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఈ గురుతర బాధ్యతను అప్పగించిన ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులుగా, ప్యాక్స్ పాలకవర్గంగా కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా నేరుగా కల్లాల వద్దకు వెళ్లి రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటామని చెప్పారు. రైతాంగం ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వేగవంతమైన పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సొసైటీ పరిధిలోని



రైతులు తమకు ఏమైనా ఇబ్బందులు లేదా సందేహాలు ఉంటే ఏ క్షణమైనా నేరుగా తమను గానీ, డైరెక్టర్లను గానీ కలిసి స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని సూచించారు.ముందుచూపుతో కార్యాచరణ రూపకల్పన చేస్తూ, రాబోయే రోజుల్లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ మరియు ఇతర ఎరువులు సరిపడా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వరి ధాన్యం కొనుగోళ్ల సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా, పారదర్శకంగా తూకాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. సొసైటీ సిబ్బంది నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు




అందించేలా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. వేములవాడ ప్యాక్స్ సంస్థాగతంగా మరింత బలోపేతమై, ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ప్రతీ ఒక్క రైతు సహకారం, సలహాలు ఎంతో అవసరమని విజ్ఞప్తి చేశారు. ఈ సర్వసభ్య సమావేశంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ సిబ్బందితో పాటు వేములవాడ పరిసర ప్రాంతాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమిద్దాం

## - ఏ ఐ ఎస్ బి ఆధ్వర్యంలో భగత్ సింగ్ కు ఘన నివాళులు

## - ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్



**కొత్తపల్లి / సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ లో గల భగత్ సింగ్ విగ్రహానికి జయంతి సందర్భంగా పూలమాలవేసి ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో భగత్ సింగ్ పాత్ర మరువలేనిదని ఉద్యమానికి నూతన ఉత్తేజాన్ని తీసుకువచ్చిన మహోన్నతమైన యువ నాయకుడు అని కొనియాడారు.చిన్న వయసులో ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ అని భగత్ సింగ్ జీవిత చరిత్ర ను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు.దేశం కోసం తన యొక్క ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన గొప్ప విప్లవకారుడు అని కొనియాడారు. భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై నిరంతరం తెలంగాణ రాష్ట్రంలో పోరాటం చేయాలని విద్యార్థిని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ వంశీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాల్వశ్రీరాంపూర్ మండల పరిషత్ లో ప్రజావాణి కార్యక్రమం

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో.ఎంపీడీవో సురేందర్ కుమార్ ఆధ్వర్యంలో. సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. వివిధ సమస్యలపై .పలు వినతి పత్రాలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో. వివిధ శాఖల అధికారులు. మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పురాతన శివాలయం బాగు కొరకు. తమ వంతు కృషి చేస్తా. మాజీ ఎంపీపీ గోప గోని సారయ్య గౌడ్.

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో గల. పురాతన శివాలయం బాగు చేయనున్నట్లు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ తెలిపారు.సోమవారం రోజున శివాలయాన్ని పరిశీలించారు. ఆయనను గ్రామస్తులు శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య. మాజీ ఎంపీటీసీలు ధూపం సంపత్ కుమార్. రావి సదానందం .మాజీ సర్పంచ్ అ టి కం శంకరయ్య గౌడ్. తదితరులు పాల్గొన్నారు.



## కొలనూర్ సింగిల్ విండో సర్వసభ్య సమావేశం

### - రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తాం : చైర్మన్ బొమ్మన భాస్కర్ రావు

**కోనరావుపేట, సెప్టెంబర్.28(ప్రజాజ్యోతి)**

రైతు సంక్షేమానికి కట్టుబడిగా పనిచేస్తామని సహకార సంఘం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని సింగిల్ విండో చైర్మన్ బొమ్మన భాస్కరరావు అన్నారు. కొనరావుపేట మండలం కొలనూర్ సహకార సంఘ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని సహకార సంఘ పరిధిలో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సకలంలో పంట రుణాలను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. సహకార సంఘ అభివృద్ధికి డైరెక్టర్లతోపాటు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సర్పంచ్లు జలగం అరవింద్, దేవరాజ్,మల్లేశం,సింగిల్ విండో డైరెక్టర్లు సుంకరి రెడ్డి, వీరబోయిన తిరుపతి యాదవ్,జాగిడి బాపూరెడ్డి, కార్తీక్, ఉప్పుల గంగయ్య, నీరటి సంజీవ్, శ్రీనివాస్, చిద్రవేని సరిత, మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి,అప్పల నాగభూషణం,ఉపసర్పంచ్లు రైతులు పాల్గొన్నారు.





## సిరిసిల్ల సభ రాజకీయం కోసమా ప్రజా సమస్యల కోసం- టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి అబ్దుల్ మజీద్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి సెప్టెంబర్ 20 ఎనిమిది (ప్రజా జ్యోతి)**

సిరిసిల్ల సభ రాజకీయం కోసమా? ప్రజా సమస్యల కోసమా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సమాధానం చెప్పాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ సిరిసిల్ల అసెంబ్లీ ఇన్చార్జ్ ఎండి మజీద్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన 5 ప్రశ్నలను సంధించారు.

1.తెలంగాణ రైతుల పరిస్థితి ఏంటి? యూరియా కోసం పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టవా?

2. నేరెళ్ల బాధితులకు జరిగిన అన్యాయం పరిస్థితి ఏంటి?

3.చేనేత కార్మికుల గోస మీకు పట్టదా?

4.ప్రభుత్వంలో అసెంబ్లీ నడిచే విధానం చూసి ప్రజలు సిగ్గుపడుతున్నారు.

5.సిరిసిల్ల సభ రాజకీయం కోసం తప్ప ప్రజా సమస్యల కోసమా? రేవంత్ రెడ్డి గారు సమాధానం చెప్పాలి ప్రజా సమస్యలు గాలికి వదిలేసి రాజకీయ సభలు పెట్టడం సరికాదని, సిరిసిల్ల ప్రజల సమస్యలపై ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.




# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు:జిల్లా ఎస్పీ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)**

జిల్లాలో సెప్టెంబర్ 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా వీవీఐపీ భద్రత, బందోబస్తు విధులు, సభా ప్రాంగణం భద్రత, హెలిప్యాడ్ భద్రత, ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్ బందోబస్తు , వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ క్లియరెన్స్, ప్రజల రాకపోకల నియంత్రణ,అత్యవసర పరిస్థితుల నిర్వహణ, పోలీస్ సిబ్బంది విధుల కేటాయింపు తదితర అంశాలపై సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ప్రతి ప్రాంతంలో భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారు ఆదేశించారు.వివిధ జిల్లాల నుండి బందోబస్తుకి వచ్చే అధికారులు,సిబ్బందిని సమన్వయం చేస్తూ విధులు నిర్వహించాలన్నారు.ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్‌లో ముందస్తు తనిఖీలు నిర్వహించి, రూట్ క్లియరెన్స్‌ను పకడ్బందీగా చేపట్టాలని, సభా ప్రాంగణంలో ప్రవేశించే వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచి,



అవసరమైన చోట మెటల్ డిటెక్టర్లు మరియు ఇతర భద్రతా తనిఖీలు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలతో పాటు ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 30న పెద్దంపేట గ్రామంలో అంటరానితనం నిర్మూలన కార్యక్రమం

**కాల్వశ్రీరాంపూర్ సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. పెద్దంపేట గ్రామంలో. ఈనెల 30 బుధవారం రోజున. అంటరానితనం నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు. తహసిల్దార్ రాపల్లి రాములు తెలిపారు ఈ కార్యక్రమానికి అధికారులు యువజన సంఘాల నాయకులు తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.



# సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి వేములవాడ రూరల్ ఎంపీడీవో శ్రీనివాస్

## - అర్జీలపై నిర్లక్ష్యం వద్దు.. వారం రోజుల్లోనే పరిష్కరిస్తాం: ఎంపీడీవో

## - ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలపై నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చు: రూరల్ ఎంపీడీవో

## - వేములవాడ రూరల్ మండల పరిషత్‌లో ప్రజావాణి.. అర్జీలు స్వీకరించిన ఎంపీడీవో

## - ప్రజావాణికి స్పందన.. వేములవాడ రూరల్‌లో నాలుగు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల రాక

**వేములవాడ,సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతోనే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వేములవాడ రూరల్ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతీ దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. బాధితులకు ఊరటనిస్తూ సాధ్యమైనంత వరకు వినతులు అందిన రోజే, లేదంటే గరిష్ఠంగా వారం రోజుల్లోగా సమస్యలకు పరిష్కారం చూపేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ విధంగా త్వరితగతిన తమ సమస్యలు పరిష్కారమవుతుండటంతో మండల ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు తమకు ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, భూ వివాదాలు, విద్య, వైద్యం లేదా ఇతర ఏ సమస్యలైనా సరే ఎలాంటి సందేహం లేకుండా నిర్భయంగా ప్రజావాణికి వచ్చి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికై మండల స్థాయి అధికారులంతా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించి నాలుగు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నంది కమాన్ వద్ద సీఎం రేవంత్, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

## - ముంపు నిర్వాసితులకు రూ. 31.75 కోట్ల పరిహారం విడుదల: కాంగ్రెస్ నేతలు

## - విప్ ఆది శ్రీనివాస్ కృషి ఫలితమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధుల విడుదల

## -10,600 నిర్వాసిత కుటుంబాలకు రూ. 234.80 కోట్ల పంపిణీకి ప్రభుత్వం కసరత్తు

**వేములవాడ, సెప్టెంబర్,28:ప్రజాజ్యోతి.**





ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏళ్ల తరబడిగా నలిగిపోతున్న బాధితులకు తగిన న్యాయం చేస్తుందని ప్యాక్స్ చైర్మన్ పిల్లి కనకయ్య మరియు వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగ పర్శరాములు గౌడ్ స్పష్టం చేశారు. వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ముంపు గ్రామాల యువతీయువకులకు ప్యాకేజీతో పాటు సంకేపల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న 45 ఇళ్లకు పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు నంది కమాన్ వద్ద శ్రీ క్షీరాభిషేకం నిర్వహించారు.ముందుగా ప్యాక్స్ చైర్మన్ పిల్లి కనకయ్య, వంగ పర్శరాము మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దగా చేసిందని ఆరోపించారు. పదేళ్ల పాటు నిర్వాసితుల కష్టాలను పట్టించుకోకుండా కాలయాపన చేశారని విమర్శించారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే ముంపు బాధితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిరంతరం శ్రమించి, నిర్వాసితుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపారని కొనియాడారు. నిర్వాసితుల పక్షాన నిలబడి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ముంపు గ్రామాల ప్రజలంతా రుణపడి ఉంటారని పేర్కొన్నారు. నిర్వాసితుల సహాయ పునరావాసం (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ కింద యువతీయువకులకు ఇవ్వాల్సిన మొత్తంతో కలిపి సుమారు రూ. 10.25 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని వెల్లడించారు. దీనితో పాటు ఇళ్లు, భూములు, దేవాలయాల నష్టపరిహారానికి సంబంధించి రూ. 14.50 కోట్లను కలెక్టర్ ఖాతాలో జమ చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. మరో రూ. 7 కోట్ల విలువైన పరిహారపు చెక్కులు కూడా సిద్ధమవుతున్నాయని, త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు. గతంలో మంజూరైన రూ. 234.80 కోట్ల నిధులను 10,600 నిర్వాసిత కుటుంబాలకు అత్యంత పారదర్శకంగా పంపిణీ చేసే అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సమావేశంలో కూలంకషంగా చర్చించారని గుర్తుచేశారు. అతి త్వరలోనే ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం నుంచి మరిన్ని శుభవార్తలు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముంపు బాధితులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, జిల్లా, మండల, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముంపు గ్రామాల ఐక్యవేదిక ప్రతినిధులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

## - వరంగల్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలని కిసాన్ సంఘ్ వినతి

**మల్లాపూర్: సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి**

రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వరంగల్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. రుణమాఫీకి అర్హత ఉన్న రైతులందరికీ బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని, వివిధ కారణాలతో రుణమాఫీ అందని రైతులకు కూడా ప్రయోజనం కల్పించాలని తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధరపై అదనంగా రూ.500 చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి, రైతులు పండించిన పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా అందించాలని, గత మూడు సంవత్సరాలకు సంబంధించిన బకాయిలను కూడా చెల్లించాలని కోరారు. భూమిలేని గ్రామీణ రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని తెలిపారు. రైతు బీమా, పంటల బీమా, పశువుల బీమా పథకాలను పునరుద్ధరించి ప్రతి రైతుకు రూ.5 లక్షల బీమా కల్పించాలని కోరారు. పోడు, అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని, రైతుల పట్టా భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. మూసివేసిన చక్కెర కర్మాగారాలను పునఃప్రారంభించాలని, సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని రైతులకు అప్పగించాలని కోరారు. చెరకు టన్నుకు




రూ.5 వేల ధర చెల్లించాలని తెలిపారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్ ట్రాలీలకు ప్రత్యేక నిబంధనలు సడలించాలని కోరారు. పంట కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, తూకం వేసిన వెంటనే రైతులకు రసీదులు ఇవ్వాలని కోరారు. కొనుగోలు ప్రక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పంట కోతలకు ముందే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలిపారు. రైతులు పండించిన మొత్తం పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో ధాన్యం ఆరబెట్టుకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద స్థలం కేటాయించాలని కోరారు. మార్కెట్ యార్డుల్లో కమిషన్, హమాలీ తదితర పేర్లతో రైతులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల పంటలను గేటు వద్దే నమోదు చేసి తక్‌పట్టీలు అందించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలని, పశుపోషణ చేసే రైతులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కిసాన్ సంఘ్ నాయకులు కోరారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల సభకు కరీంనగర్ నుంచి వేలాదిగా తరలివెళ్తాం సీఎం సభను ఘనంగా విజయవంతం చేస్తాం..

## - కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు

## - సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన రాజేందర్‌రావు

**కొత్తపల్లి సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి)**

కరీంనగర్, ఈనెల 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభకు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేలాదిమందితో తరలివెళ్లనున్నట్లు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులను పెద్ద ఎత్తున సమీకరించి సభను విజయవంతం చేస్తామని అన్నారు.సీఎం సభ ఏర్పాట్ల నేపథ్యంలో సోమవారం సాయంత్రం సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని రాజేందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సభ నిర్వహణ, ప్రజల తరలింపు తదితర అంశాలపై వారితో చర్చించారు.కరీంనగర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజలను సిరిసిల్ల సభకు తరలించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేస్తామని రాజేందర్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సభకు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజావాణికి మూడు అర్జీలు

## అధికారుల సమన్వయంతో పరిష్కారానికి చర్యలు,

**ఎండపల్లి, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి,**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మూడు అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో డి.కృపాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన రెండు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఒక అర్జీ అందింది. అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీవో సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వ్యవసాయాధికారి కే.మహేష్, పశువైద్యాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్, మండల తహశీల్దార్ కార్యాలయం నుండి ఆర్ ఐ అన్వేష్,మండల విద్యాధికారి కార్యాలయం నుండి బి.కిషోర్‌కుమార్, సీడీపీవో ఎం.ఆండాలు, ఎండపల్లి వసతి గృహ సంక్షేమ అధికారి ఎం.డి.అప్సర్, హౌసింగ్ ఏఈ ఎస్.గౌతమి, ఫారెస్ట్ అధికారి ఇ.నరేష్, వైద్య శాఖ నుండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

**జగిత్యాల రూరల్, సెప్టెంబర్28 (ప్రజాజ్యోతి):**

'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తాటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమంనిర్వహించారు.ఈ కార్యక్రమానికి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ ఎన్. అనూష, ఎఎన్ఎం పి. శ్రీశైల మరియు ఆశా కార్యకర్తలు జల, లత, హేమలత, రేవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, మద్యం మరియు సిగరెట్ వంటి దురలవాట్ల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా ఉజ్వలమైన భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకొని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.అనంతరం విద్యార్థుల చేత "నషా ముక్త్ భారత్" (మాదకద్రవ్యాల రహిత భారత్) ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి:

## - కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 28(ప్రజాజ్యోతి):**

ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తున్నారని, ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా తీసుకొని క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 62 ఫిర్యాదులు అందాయని, వాటిపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కె.వై. ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు :ఏఓ జ్యోతి

**కొడిమ్యాల,సెప్టెంబర్ 28,(ప్రజాజ్యోతి):**

ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి హెచ్చరించారు. సోమవారం మండలంలోని వివిధ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, రిజిస్టర్లు, బిల్లులను పరిశీలించారు. అనుమతి లేని కంపెనీల నుంచి సరుకు తెప్పించడం, లైసెన్సులో నమోదు కాని కంపెనీల ఉత్పత్తులను విక్రయించడం, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు అమ్మడం చేస్తే ఫర్టిలైజర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు నిబంధనల ప్రకారం సరుకులు విక్రయించాలని సూచించారు.



# రామాజీపేటలో ఘనంగా పోషణ మాస కార్యక్రమం

**రాయికల్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలోని 4వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) పొందుతున్న పిల్లల తల్లిదండ్రులకు పోషకాహారం, ఆరోగ్యం, పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించారు.అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు సమతుల్యమైన పోషకాహారం అందించడం, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉప సర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి వార్డు సభ్యురాలు గుర్రం రజిత, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, ఆశా కార్యకర్తలు సూర మమత, నాగిరెడ్డి లత, పడిగెల లావణ్య, వీఓఏలు రజియా, కవిత, అంగన్వాడీ టీచర్లు నాగెల్లి రమాదేవి, జుంబర్తి జమున, మండల నిషిత, అంగన్వాడీ ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# గౌడలకు కాటమయ్య కిట్లు.. వినియోగంపై శిక్షణ

**మల్లాపూర్: సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి**

మండల కేంద్రంలో సోమవారం మండలంలోని గౌడ సంఘ సభ్యులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటమయ్య కిట్ల వినియోగం, వాటి ఉపయోగాలపై సభ్యులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. గౌడ సంఘ సభ్యులందరూ కాటమయ్య కిట్లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సింధు, ఆమె సిబ్బంది, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కాటమయ్య కిట్ల శిక్షకులు పాల్గొన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు ముద్దం శరత్‌గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు మద్యం సత్యనారాయణగౌడ్, గొట్టిపడత సత్యగౌడ్, పెరుమాండ్ల అర్జున్‌గౌడ్, అలాల నరసయ్య, నాయని శేఖర్, ఏపూరి గంగారం, ఆకుల శ్రీనివాస్, గొట్టిపడుత శ్రీనివాస్, లక్ష్మీరాజం, రాజేందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయ స్థలంలో పెట్రోల్ బంక్ ఏంటి?: ప్రభుత్వ తీరుపై జీవన్ రెడ్డి ధ్వజం

**జగిత్యాల టౌన్,సెప్టెంబర్28 (ప్రజాజ్యోతి):**

సిరిసిల్లలో ఎనిమిది ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని ముఖ్య మంత్రి వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో, అసలు నిజానిజాలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాలలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**తహసీల్దార్ కార్యాలయ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుపై ఆగ్రహం:**

శతాబ్దాల చరిత్ర కలిగిన జగిత్యాల తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చివేసి, ఆ స్థలంలో ఏకపక్షంగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడాన్ని జీవన్‌రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. చారిత్రక భవనాన్ని రక్షించాల్సింది పోయి, నిబంధనలకు విరుద్ధంగా లీజ్ అగ్రిమెంట్ చేశారని ఆరోపించారు. సర్వే నంబర్ 138కి సంబంధించిన అంశాలను, లీజ్ నిబంధనలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా రైతాంగానికి, నేత కార్మికులకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. సిరిసిల్లలోని బీడీ, నేత కార్మికుల పిఎఫ్, పెన్షన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సీఎం పర్యటనలు ద్వేషపూరితంగా కాకుండా ప్రజా సంక్షేమం వైపు ఉండాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కతార్‌లో అనారోగ్యంతో భారతీయుడి మృతి - నడికూడాలో విషాదం.. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని విజ్ఞప్తి

**మల్లాపూర్: సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి**

కతార్‌లో అనారోగ్యంతో నడికూడా గ్రామానికి చెందిన తలారి ముత్తేన్న అకాల మృతి చెందారు. ఉపాధి నిమిత్తం కొంతకాలంగా కతార్‌లో ఉంటున్న ఆయన ఆరోగ్య సమస్యలతో మృతి చెందడంతో నడికూడా గ్రామంలో విషాదం నెలకొంది. ముత్తేన్న మాజీ ఎఫ్ఏగా పనిచేయడంతో పాటు, సీనియర్ అంబేద్కర్ నాయకుడిగా గ్రామంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అంబేద్కర్ ఆశయాల కోసం పనిచేసిన ముత్తేన్న మృతివార్త తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ సభ్యులకు ముత్తేన్న మృతి తీరని లోటుగా మారిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ముత్తేన్న కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరారు. అలాగే కతార్‌లో ఉన్న ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన నడికూడాకు తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టి, కుటుంబానికి అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# ఆయుర్వేద వైద్యశాలకు డాక్టర్‌ను కేటాయించాలి

**మల్లాపూర్: సెప్టెంబర్ 28 ప్రజాజ్యోతి**

మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు తక్షణమే వైద్యాధికారిని కేటాయించాలని సర్పంచ్ కనుమల వెంకటేష్ ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. ఆసుపత్రి భవనం, మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ డాక్టర్ లేకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదన్నారు. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రైవేటు ఆసుపత్రులు, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. తక్షణం వైద్యుడిని నియమించలేని పక్షంలో వారంలో కొన్ని రోజులైనా డిప్యుటేషన్‌పై వైద్యుడిని పంపించి ఆయుర్వేద సేవలు అందించాలని కోరారు.



# ఉత్తమ భాషోపాధ్యాయులకు ఆర్.యు.పి.పి.టి.ఎస్ జగిత్యాల జిల్లా శాఖ భగవద్గీతల ప్రధానం , ఘన సన్మానం

**రాయికల్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

జిల్లా స్థాయి, మండల స్థాయి ఉత్తమ భాషోపాధ్యాయ అవార్డు లు పొందిన హిందీ భాషోపాధ్యాయులకు ఆర్.యు.పి.పి.టి.ఎస్ రాయికల్ మండల, జిల్లా శాఖ పక్షాన ఘనంగా సన్మానించి భగవద్గీతలను ప్రధానం చేసారు. సోమవారం రాయికల్ మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లేక్ సమావేశం ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విరామ సమయంలో హిందీ సబ్జెక్టు లో జిల్లా స్థాయి అవార్డు పొందిన జాదవ్ వసంతరావు, తిరుకోవెల నారాయణ, మండల స్థాయి అవార్డులు పొందిన మ్యాకల శంకరయ్య, శీలలం పద్మజ, వడ్లకొండ ధనలక్ష్మి, షాజిద్ రిహానా లకు రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్.యు.పి.పి.టి.ఎస్) జగిత్యాల జిల్లా, రాయికల్ మండల శాఖల పక్షాన జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, మండల అధ్యక్షులు మోర నరహరి లు కాంప్లెక్స్ హిందీ భాషోపాధ్యాయులు ఘనంగా శాలువాలతో సత్కరించి, భగవద్గీత ప్రదానం చేసారు. ఈ సందర్భంగా వారు ఉత్తమ ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తు లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో మరిన్ని అవార్డు లు జాతీయభాష అభివృద్ధికి దోహదపడాలని, జాతీయ భాష జాతీయభావాలను పెంపొందిస్తుందని, హిందీ ఉపాధ్యాయులు ఆదిశగా ప్రయత్నం చేయాలని, ఈదేశంలో ఉన్నవారందరు ఈ భూమి నా తల్లి నేను భూమి పుత్రుండను అనే భావన తో మాతృభూమి పట్ల దేశభక్తి భావన కలిగి వుండాలని అన్నారు. ఈ కార్యక్రమం లో రిసోర్స్ పర్సన్స్ యం.డి సయీద్ పాషా, మేన్నేని నీలిమ, రాపర్తి నర్సయ్య,




బొంగోని మల్లయ్య, రంగు రమేష్, ఆర్.నగేష్, ఎ.గంగాధర్, రాజేశం, కె. యశోద, గోసికొండ సుజాత, మాదాసు రమ, బి.రాధ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు అడిగిన వ్యక్తిపై దాడి.. చంపుతామని బెదిరింపు

**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**

కోరుట్ల మండలంలోని సర్వరాజు పల్లి లో డబ్బులు అడిగిన వ్యక్తిపై దాడి ఘటనలో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సర్వరాజుపల్లి గ్రామానికి చెందిన కొక్కు రాజు (40) సౌదీలో పనిచేసిన సమయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సిమ్మల్ల మధు తనకు రూ.12 లక్షలు ఇవ్వాల్సి ఉందని పలుమార్లు డబ్బులు అడిగినప్పటికీ మధు వాయిదా వేస్తూ వచ్చాడని ఈ క్రమంలో సెప్టెంబర్ 27వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో సర్వరాజుపూర్ బస్టాండ్ వద్ద నుంచి బైక్‌పై వెళ్తుండగా గణేష్ (మధు కుమారుడు), దిలీప్, రఘురాం, హరీష్ తదితరులు తనను అడ్డగించి దూషించారని తన ముఖం, దవడపై కొట్టి, ఇకపై డబ్బులు అడిగితే చంపుతామని బెదిరించినట్లు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరుట్ల పోలీసులు తెలిపారు.

# రాజేశం గౌడ్‌కు మూల శ్రీనివాస్ గౌడ్ పరామర్శ

**బుగ్గారం, సెప్టెంబరు 28(ప్రజాజ్యోతి):**

మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి, తెలంగాణ తొలి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్‌ను బుగ్గారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మూల శ్రీనివాస్ గౌడ్ సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# సర్ పై కాంగ్రెస్ నిరసన

## ధ్రువపత్రాలు సమర్పించినా నోటీసులు రావడం ఆశ్చర్యం: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార

**జగిత్యాల టౌన్,సెప్టెంబర్28 (ప్రజాజ్యోతి):**

ఎస్ఐఆర్ (ా×=) ప్రక్రియలో అక్రమాలు, ఏకపక్ష విధానాలను నిరసిస్తూ ఏఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజంగి నందయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. అన్ని సరైన ధ్రువపత్రాలు, వివరాలు సమర్పించినప్పటికీ తిరిగి నోటీసులు జారీ చేయడం ఆశ్చర్యకరమన్నారు. తనకు, మాజీ మంత్రి రాజేశం గౌడ్‌కు కూడా నోటీసులు వచ్చాయంటే సామాన్య ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. నిత్యావసరాలు, గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుతో సామాన్యులు, ఉపాధి హామీ పనిదినాలు తగ్గించడంతో గ్రామీణ కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, అనంతరం ఆర్డీవో



మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, లైబ్రరీ చైర్మన్ దినేష్, టిపిసిసి నాయకులు కృష్ణారావు, బండ శంకర్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థినికి ఈటీసీఏ చేయూత రూ.50 వేల ఆర్థిక సాయం

## అందజేసిన వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్

**రాయికల్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)**



రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని కనికారపు అంజలి చదువుకు ఈటీసీఏ చేయూత అందించింది. దుబాయ్‌లోని ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు పిచర్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు స్పందించి సోమవారం రామాజీపేట గ్రామానికి చేరుకుని అంజలికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ అంజలి వైద్య విద్యను విజయవంతంగా పూర్తిచేసే వరకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో చదువుకు సంబంధించిన ఖర్చులను సైతం భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న అంజలికి ఆర్థిక సహాయం అందించడం పట్ల గ్రామస్తులు ఈటీసీఏ సభ్యులను, కిరణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ఉన్నత విద్యకు సంఘం అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉప సర్పంచ్ సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వాసరి రవి, దశమందం వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల మహేష్, వట్టిమల్ల శ్రీనివాస్, అన్నవేని వేణు, గుజ్జుల కిరణ్ రెడ్డి, ఇద్దం తిరుపతి రెడ్డి, రాజేందర్, నేతుల తిరుపతి, సింగినేని హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.